



గాంధీ, శాస్త్రిలకు ఘన నివాళి



జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని జిల్లావ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ కార్యాలయం వద్ద గల మహనీయుల విగ్రహాలకు నేతలు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. సత్యం, అహింస నినాదంతో గాంధీ జాతిని మేల్కొలిపారని, జై జవాన్, జై కిసాన్ నినాదంతో యువతలో శాస్త్రి స్ఫూర్తిని రగిలించారన్నారు.

ఉక్కు కార్మికులకు షర్మిల సంఘీభావం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి బుధవారం నగరంలో పర్యటించారు. బీజేపీ ఫాసిస్టు శక్తుల నుంచి ఈ దేశాన్ని కాపాడాలంటూ జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి ఆమె వినతిపత్రం అందజేశారు. అనంతరం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడుతున్న ఉద్యోగులు, కార్మికులకు సంఘీభావం తెలిపేందుకు కూర్మన్నపాలెం వెళ్లారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కూర్మన్నపాలెం జంక్షన్‌లో చేపట్టిన రాస్తారోకోలో షర్మిల పాల్గొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేపడుతున్న ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. -విశాఖపట్నం




ఉక్కు కార్మికుల రాస్తారోకోలో పాల్గొన్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

ఏయూలో ఏఐ

వీఎల్ఎస్ఐ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ కోర్సులు కూడా...

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు
- విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యమంటున్న వర్సిటీ అధికారులు
- వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్ కోర్సు నిర్వహణకు అవసరమైన నిధులు అందించేందుకు ముందుకొచ్చిన మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ





(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కొత్త కోర్సులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి బీటెక్, ఎంటెక్‌లలో నూతన బ్రాంచీలను ప్రవేశపెట్టనున్నారు. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న కోర్సులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించవచ్చునంటున్నారు.

బీటెక్‌లో వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్ (వీఎల్ఎస్ఐ) కోర్సును ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన నిధులను అందించేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ అంగీకరించింది. ఈ మేరకు మైటీ (మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) కార్యదర్శి ఎస్.కృష్ణతో ఏయూ అధికారులు సంప్రతింపులు జరిపారు. ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు భారీ వేతనాలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. వచ్చే ఏడాది నుంచే దీనిని ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వీఎల్ఎస్ఐ కోర్సు చేస్తే మైక్రో చిప్‌లు తయారీ, సెమీ కండక్టర్ల రూపకల్పన, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లు తయారీ కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఈ కోర్సు నిర్వహణ కోసం అడ్వాన్స్‌డ్ లేబొరేటరీ, ఫ్యాకల్టీ, రీసెర్చ్ ప్రాజెక్టులను కూడా 'మైటీ' సమకూర్చనున్నది. దీంతోపాటు ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సును వచ్చే ఏడాది నుంచి ప్రారంభించనున్నారు. అదేవిధంగా ఇప్పటికే అపారమైన అవకాశాలను కల్పిస్తున్న క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ ... మిగతా 6వ పేజీలో

పర్యాటక అక్రమాలపై మరో కమిటీ

నేడు విశాఖపట్నం రాక


తొట్లకొండ వద్ద బేవాచ్ రిసార్ట్స్

- గత ప్రభుత్వ హయాంలో ఏపీటీడీసీ లీజులపై ఆరోపణలు
- నిబంధనలకు విరుద్ధంగా తొట్లకొండలో బే వాచ్, రుషికొండలో రెస్టారెంట్, భీమిలి సమీపాన కంటెయినర్ రెస్టారెంట్ మేర్లిన్ కేఫ్‌లు నిర్వహణ
- యాత్రీ నివాస్ ఆధునికీకరణ పనుల్లో కూడా అవకతవకలు?

విశాఖపట్నం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) లీజులు, వివిధ ప్రాజెక్టుల నిర్వహణలో లోపాలపై విచారణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మరో విజిలెన్స్ కమిటీని నియమించింది. ఐదుగురు సభ్యులతో కూడిన ఈకమిటీ గురువారం విశాఖపట్నం రానుంది.

విశాఖ-భీమిలి మార్గంలో తొట్లకొండ వద్ద గల బే వాచ్, రుషికొండలో రెస్టారెంట్, భీమిలి సమీపాన కంటెయినర్ రెస్టారెంట్ మేర్లిన్ కేఫ్, బ్లూ ఫ్లాగ్ బీచ్ నిర్వహణ తదితరాలపై తీవ్ర ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. బే వాచ్‌ను ఏపీటీడీసీ ఒకరికి లీజుకు ఇస్తే దానిని వైసీపీ నాయకులు హస్తగతం చేసుకొని, సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన విషయం వెలుగులోకి వచ్చింది. అదేవిధంగా ఏపీటీడీసీ తీసుకున్న మద్యం లైసెన్స్‌తో వేరే వారు విక్రయాలు చేస్తున్న సంగతి బయటపడింది. మేర్లిన్ కేఫ్ కోటి రూపాయలకు పైగా అద్దె బకాయి ఉన్నా చర్యలు తీసుకోని విషయం తేటతెల్లమైంది. బ్లూ ఫ్లాగ్ బీచ్ నిర్వహణ సరిగా లేదని ఆరోపణలు వచ్చాయి. అలాగే రుషికొండలో జగన్ ప్యాలెస్ నిర్మాణం కోసం పాత రిసార్ట్స్‌ను కూలగొట్టినప్పుడు అక్కడి ఫర్నీచర్‌ను సిబ్బంది అడ్డగోలుగా అమ్ముకొని ఆ మొత్తం జేబులో వేసుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అదేవిధంగా ఎంవీపీ కాలనీలోని అప్పుఘర్ వద్ద రూ.13 కోట్లతో ఆధునికీకరిస్తున్న యాత్రీ నివాస్ పనుల్లో కూడా అంచనా పెంచి నిధులు దిగమింగారనే ఆరోపణలు వచ్చాయి. ఇవన్నీ పత్రికల ద్వారా వెలుగులోకి రావడంతో ప్రభుత్వం రెండు వారాల క్రితం విజిలెన్స్ కమిటీని విచారణకు పంపించింది. అందులో ఒక అధికారి గతంలో పర్యాటక శాఖా మంత్రి రోజా వద్ద ఓఎస్‌డీగా పనిచేసినందున, విచారణ సరిగ్గా నిర్వహించలేదని, లీజుదారులకు అనుకూలంగా నివేదిక ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో పర్యాటక శాఖా మంత్రి విజయవాడ అధికారులపై సీరియస్ అయ్యారు. మంత్రి రోజా వద్ద ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి టెట్

ఉమ్మడి జిల్లాలో 8 కేంద్రాలు, 60,574 మంది అభ్యర్థులు

విశాఖపట్నం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) గురువారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21వ తేదీ వరకూ విశాఖ జిల్లాలో ఏడు కేంద్రాలు, అనకాపల్లి జిల్లాలో ఒక కేంద్రంలో ఆన్‌లైన్‌లో ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. మొత్తం 60,574 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తొలిసారి నిర్వహిస్తున్న టెట్‌కు విద్యా శాఖ అన్ని ఏర్పాట్లుచేసింది. ప్రతి కేంద్రానికి ఒక పరిశీలకుడిని నియమించింది. టెట్ నిర్వహణకు సంబంధించి డీఈవో కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు నిర్ణీత సమయం కంటే ముందుగానే కేంద్రాలకు రావాలని విశాఖ జిల్లా విద్యాశాఖాధికారిణి చంద్రకళ విజ్ఞప్తి చేశారు.

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం రేపు

- 124 అంశాలతో ఎజెండా

విశాఖపట్నం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల నాలుగున నిర్వహించనున్నట్టు కార్యదర్శి ఎంవీడీ ఫణిరాం తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో చర్చించేందుకు 124 అంశాలతో ఎజెండా తయారుచేసి సభ్యులకు అందజేశారు. వీటిలో 30 అంశాలు గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో వాయిదా వేసిన మెకానికల్ విభాగానికి సంబధించినవే కావడం గమనార్హం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని ... మిగతా 6వ పేజీలో

బూత్ బంగ్లాలా జడ్పీ అతిథి గృహం


జిల్లా పరిషత్ అతిథిగృహం

మూడున్నరేళ్ల క్రితం నాటి పంచాయతీరాజ్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాల మేరకు ఆధునికీకరణ పనులు ప్రారంభం

- ప్రభుత్వ ఆమోదం లేకుండా కాంట్రాక్టర్‌కు అప్పగింత
- ఆయన మారిపోవడం, ఆ తరువాత పాలనా రాజధాని అంశం మరుగునపడడంతో నిలిచిన పనులు
- అప్పటివరకూ వెచ్చించిన నిధుల విడుదలకు ముత్యాలనాయుడు విముఖం
- అప్పటి నుంచి నిరుపయోగంగా గెస్ట్ హౌస్
- ఎందుకూ పనికిరాకుండా పోయిన ఫర్నిచర్


అతిథి గృహంలో విరిగిపోయిన డైనింగ్ టేబుల్, కుర్చీలు

విశాఖపట్నం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి):

నగరంలోని అప్పుఘర్ సమీపాన గల జిల్లా పరిషత్ అతిథిగృహం శిథిలావస్థలో ఉంది. ఏసీలు, ఫ్యాన్లు, గీజర్లు తుప్పుపట్టాయి. చాలా రోజులుగా వినియోగించకపోవడంతో మంచాలపై పరువులు, కుర్చీలు, సోఫాలు, టీపాయ్‌లు, టీవీలు పాడైపోయాయి. ఏసీ గదుల్లో సీలింగ్ పడిపోయింది. విద్యుత్ బోర్డులు, వైరింగ్ ఊడిపోయి కనిపిస్తున్నాయి. అతిథి గృహాన్ని మూడున్నరేళ్ల నుంచి జడ్పీ పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో బూత్ బంగ్లాలా మారింది. తిరిగి వినియోగంలోకి తీసుకురావాలంటే ఖర్చు భారీగానే అవుతుందంటున్నారు.

జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విశాఖను పాలనా రాజధాని చేస్తామని ప్రకటించడంతో అప్పటి పంచాయతీరాజ్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నగరంలో గెస్ట్ హౌస్ చూడాలని అధికారులకు ఆదేశించారు. వెంటనే అధికారులకు జడ్పీ అతిథి గృహం గుర్తుకు వచ్చింది. దానిని పూర్తిగా ... మిగతా 6వ పేజీలో


ఊడి పడిపోయిన సీలింగ్

155 మద్యం దుకాణాలు

తొమ్మిదో తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ

- దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు
- దుకాణానికి సగటున 20 దరఖాస్తులు వస్తాయని అంచనా
- ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లో లైసెన్స్ ఫీజు రూ.65,000
- సిటీలో రూ.85,000
- 11న లాటరీ ద్వారా దుకాణాలు కేటాయింపు



విశాఖపట్నం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీ ప్రకారం జిల్లాలో 155 ప్రైవేటు దుకాణాలు ఏర్పాటుకు కలెక్టర్ హరేందిర్ ప్రసాద్ నోటిఫికేషన్ జారీచేశారు. ఈనెల తొమ్మిదో తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తు ఫీజు కింద రూ.రెండు లక్షలు డీడీ తీసి అందించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తుచేసుకునే వెసులుబాటు కల్పించారు. పద్మనాభం మండలంలో ఏడు, ఆనందపురం మండలంలో ఎనిమిది, భీమిలి మండలంలో నాలుగు దుకాణాలు, జీవీఎంసీ పరిధిలో 136 దుకాణాలకు అవకాశం ఇవ్వనున్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని దుకాణాలకు లైసెన్స్ ఫీజు కింద ఏడాదికి రూ.65 లక్షలు, జీవీఎంసీ పరిధిలోని దుకాణాలకు రూ.85 లక్షలుగా నిర్ణయించారు. రెండో ఏడాది పది శాతం చొప్పున పెంచుతారు. లైసెన్స్ ఫీజును ఏడాదిలో ఆరు విడతల్లో చెల్లించేలా దుకాణదారులకు అవకాశం కల్పించారు. జిల్లాలో ఒక్కో దుకాణానికి సగటున 20 చొప్పున 155 దుకాణాలకు 3,100 దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. లాటరీలో దుకాణం దక్కకపోతే దరఖాస్తు ఫీజు వాపసు ఇవ్వరు కాబట్టి దరఖాస్తు ఫీజు కింద ప్రభుత్వానికి రూ.62 కోట్లు ఆదాయం సమకూరుతుంది. ఈ నెల 11వ తేదీన సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జిల్లా జాయింట్ కలెక్టర్ సమక్షంలో లాటరీ తీసి దుకాణాలను కేటాయిస్తారు. లాటరీలో దుకాణం దక్కించుకున్నవారు అదేరోజు లైసెన్స్ ఫీజు కింద తొలి విడత మొత్తాన్ని డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. 12వ తేదీ ఉదయం నుంచి దుకాణాల్లో మద్యం విక్రయాలు చేసుకోవచ్చు. దుకాణం దక్కిన వారు రెండేళ్లపాటు విక్రయాలు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

గాంధీజీ, శాస్త్రిలకు ఘననివాళి



టీడీపీ కార్యాలయంలో గాంధీ, శాస్త్రిల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న తెలుగుదేశం నగర అధ్యక్షుడు గండి బాబ్జీ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు



జనసేన నగర కార్యాలయంలో గాంధీ, శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



పార్టీ కార్యాలయంలో జాతినేతల చిత్రపటాలకు నమస్కరిస్తున్న బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక తదితరులు

మహారాణిపేట, అక్టోబరు 2: తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు, ఇద్దరు ప్రముఖుల చిత్రపటాలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జి, శాసనమండలి సభ్యుడు వేపాడ చిరంజీవిరావులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రజల గుండెల్లో ఈ నేతలిద్దరూ చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పొలమర శెట్టి శ్రీనివాసరావు, సౌత్ ఇన్‌చార్జు సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్లు గొలగాని వీరరావు, ఉరుకూటి నారాయణరావు, వి.భాస్కరరావు, వి.భరత్, కేదారి లక్ష్మి, గనగళ్ల సత్యవతి పాల్గొన్నారు. కేజీహెచ్ పరిపాలనా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, అధికారులు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు వైద్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం (స్పోర్ట్స్): మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను పోర్టు స్టేడియంలో కరాటే సంఘాల ప్రతినిధులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ నటుడు సుమన్ ముఖ్య అతిథిగా హాజరై శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాస్త్రి చేసిన జై కిసాన్, జై జవాన్ నినాదం విశేష ప్రాచుర్యం పొంది ప్రజల్లో దేశభక్తిని పెంపొందించిందని సుమన్ గుర్తుచేశారు. రెండో ప్రధానిగా ఆదర్శనీయమైన సేవలందించిన మహోన్నత వ్యక్తిగా లాల్ బహదూర్ శాస్త్రి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో కాశీ విశ్వనాథ్, డాక్టర్ రఘు, సీహెచ్.సతీష్‌కుమార్, ఆనంద బాలు, కరాటే క్రీడాకారులు, మాస్టర్లు పాల్గొన్నారు.

సీతంపేట: జనసేన నగర పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన పార్టీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ నియోజకవర్గాల ఇంచార్జులు ఉషాకిరణ్, ప్రశాంతి, శివ ప్రసాద్‌రెడ్డి, వసంత లక్ష్మి, కార్పొరేటర్ నాగరాజు పాల్గొన్నారు.

సీతమ్మధార: సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో గాంధీజీ, మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తిల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీరి చిత్రపటాలకు బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతమ్మధారలోని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో గాంధీజీ కాంస్య విగ్రహానికి ఉద్యోగులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చీఫ్ జనరల్ మేనేజర్లు డి.సుమ్ కల్యాణి, బి.రామచంద్రప్రసాద్, ఎస్.హరిబాబు, టీవీఎస్ఎన్ మూర్తి, బి.అశోక్ కుమార్, జనరల్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: పోర్టుస్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు. శాంతిపురంలో లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహానికి రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అల్లిపురం: అల్లిపురం నీలమ్మ వేపచెట్టు, నేరెళ్ల కోనేరు ప్రాంతాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని జాతిపితకు ఘననివాళులర్పించారు. నీలమ్మవేప చెట్టు ప్రాంతంలో జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటర్ బీశెట్టి వసంత లక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నేరెళ్ల కోనేరు వద్ద కార్పొరేటర్ కందుల నాగరాజు వృద్ధులకు కళ్ల జోళ్లు పంపిణీ చేశారు.

మురళీనగర్; మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మాధవధార కళింగనగర్ వైసీపీ కార్యాలయంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, ఆ పార్టీ నాయకులు, అనుచరులు, స్థానికులతో కలసి గాంధీ మహాత్మునికి నివాళి అర్పించారు. 51వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వార్డు అధ్యక్షులు సనపల. కీర్తి ఆధ్వర్యంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు సంయుక్తంగా వేడుకలు జరిపారు. 50వ వార్డు వాకర్స్‌క్లబ్‌లో పల్లా చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులు వాకర్స్ పార్కులోని స్మారక విగ్రహం వద్ద గాంధీకి పూలమాలలతో నివాళి అర్పించారు. వైశాఖీ స్పోర్ట్స్ పార్కులోనూ, తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోనూ అధ్యక్షుడు సనపల. వరప్రసాద్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయాలు, యువజన, కాలనీ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.

కరాటేను ప్రత్యేక క్రీడాంశంగా గుర్తించాలి

▸▸ సినీ నటుడు సుమన్ సూచన

విశాఖపట్నం (స్పోర్ట్స్), అక్టోబరు 2: కరాటేను ప్రత్యేక క్రీడాంశంగా గుర్తించి ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని సినీ నటుడు సుమన్ తల్వార్ సూచించారు. వాడోకై కరాటే సంఘం, డ్రాగన్ ఫోర్సు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించనున్న రెండో వైజాగ్ ఓపెన్ జాతీయ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీ బ్రోచర్‌ను బుధవారం పోర్టు స్టేడియంలో సుమన్ తల్వార్ ఆవిష్కరించారు. కరాటేను ఆత్మరక్షణకు దోహదపడే విద్యగా పరిగణించాలన్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో ఏది నేర్చుకున్నా ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుందన్నారు. కరాటే క్రీడాంశానికి విశాఖ ప్రధాన కేంద్రంగా గుర్తింపు పొందుతోందన్నారు. కొత్త టెక్నిక్స్‌పై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించిన సతీష్‌కుమార్ అభినందనీయుడని కొనియాడారు. టోర్నీ ప్రధాన నిర్వాహకుడు చిగురుపల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ డిసెంబరు 15 నుంచి పోర్టు స్టేడియంలోని విశ్వనాథ స్పోర్ట్సు క్లబ్ వేదికగా నిర్వహించనున్న వైజాగ్ ఓపెన్ జాతీయ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీలో సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బొడ్డేటి కాశీ విశ్వనాథ్, జనసేన రాష్ట్ర వైద్య విభాగం చైర్మన్ బొడ్డేపల్లి రఘు, బీజేపీ నాయకులు బొత్స సురేష్‌కుమార్, కరాటే మాస్టర్లు అంగరాము, ఆనందబాలు, బాలకృష్ణ, అంబు, శివగణేష్ పాల్గొన్నారు.



వైజాగ్ ఓపెన్ జాతీయ కరాటే టోర్నీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు సుమన్, ఇతర ప్రముఖులు

ఆలయాల్లో శరన్నవరాత్రి శోభ

జగదాంబ కూడలి, అక్టోబరు 2: పాతనగరంలోని ప్రధాన ఆలయాల్లో శరన్నవరాత్రి పూజలకు దేవాలయాల అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి ఈ నెల 12 విజయదశమి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఈవో కె.శోభారాణి తెలిపారు. విజయవాడ కనదుర్గ ఆలయంలో మాదిరి కనకమహాలక్ష్మి ఆలయం వద్ద అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ క్రమంలో ఉదయం 6 గంటల నుంచి 9 వరకు భక్తుల దర్శనాలకు అనుమతించచడంలేదన్నారు. ప్రత్యేక వారాల్లో నిర్వహించనున్న క్షీరాభిషేకం, అష్టదళ పద్మారాధన, తులసీదళ పూజలు నిలిపివేస్తారు. పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి వద్ద దుర్గాదేవి భక్తులు మాలధారణలతో అమ్మవారి పూజలకు సిద్ధమవుతున్నారు. కుమ్మరవీధి ప్రాంతంలో బహుముఖ రూపాల పోలమాంబ అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ పేర్కొంది. పాతనగరంలోని దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న పలు ముఖ్య దేవాలయాలను దసరా ఉత్సవాల సందర్భంగా ముస్తాబు చేశారు.



కనకమహాలక్ష్మి అమ్మవారు



భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

సాయి ధ్యానమందిరంలో అన్న సమారాధన

అక్కయ్యపాలెం, అక్టోబరు 2: గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో బుధవారం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు మాట్లాడుతూ నిత్యాన్నదాన కార్యక్రమాన్ని 14 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరి కుటుంబంలోనైనా జరిగే వివాహ, జన్మదినం, పెద్దల జ్ఞాపకార్థం, ఇతర శుభకార్యాలకు సాయిబాబా నిత్యాన్న ప్రసాదం వితరణ చేస్తున్నట్లు చెప్పారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

మర్రిపాలెం, అక్టోబరు 2: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఇంటూరి భూషణం మాస్టార్ ఆధ్వర్యంలో కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం సీఐ మాట్లాడుతూ పర్యవరణాన్ని కాపాడి పచ్చదనాన్ని పెంపొందించవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కొత్తపాలెం తెలుగు ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు, సూరిబాబు, పోలీసుస్టేషన్ సిబ్బంది రవిచంద్ర, వైఆర్ఎస్ రెడ్డి పాల్గొన్నారు.



▸▸ మొక్క నాటుతున్న సీఐ దాశరథి

పరిశుభ్రత దిశగా పయనిస్తున్నాం

▸▸ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 2: గాంధీ జయంత్యుత్సవాల్లో భాగంగా వాల్తేరు రైల్వే 15 రోజులు నిర్వహించిన స్వచ్ఛా హి సేవ కార్యక్రమాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్, ఏడీఆర్ఎంలు సుధీర్ కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు డీఆర్ఎం కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతలో అగ్రగామిగా నిలిచే దిశగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. వేదిక వద్ద ప్రదర్శించిన స్వచ్ఛా హి సేవా అంశంపై విద్యార్థులు రూపొందించిన చిత్రాలు బాగున్నాయని అభినందించారు. పారిశుధ్య కార్మికులకు హెల్త్ కిట్లు పంపిణీ చేయడంతోపాటు, స్వచ్ఛా హి సేవా అంశంపై నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం స్టేషన్ సమీపంలోని రైల్వే పార్కును పారిశుధ్య పనులలో డీఆర్ఎం, అధికారులు, వాల్తేరు డివిజన్ మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు శుభ్రం చేశారు.



పార్కును శుభ్రపరుస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఇతర సిబ్బంది

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు



కృత్రిమ అవయవాలు పొందిన లబ్ధిదారులతో నిర్వాహకులు

సీతమ్మధార, అక్టోబరు 2: సీతమ్మధారలోని క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ మంగళంపల్లి సౌజన్యంతో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్స్, వినికిడి పరికరాలు, అంధులకు చేతికర్రలు తదితర పరికరాలు పంపిణీ చేశారు. వీటి విలువ సుమారు రూ.2.5 లక్షలు ఉంటుందని తెలిపారు. 150 మంది దివ్యాంగులు పాల్గొని కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్ తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మహీధర కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.లక్ష, క్షత్రియ సంక్షేమ సమితి చైర్మన్ ఎంఎస్ఎన్ రాజు రూ.లక్ష, డైరెక్టర్ ఎంఆర్‌కె రాజు రూ.50 వేలు వితరణ చేశారు. అధ్యక్షులు దాట్ల తిరుపతి రాజు, చైర్మన్ ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి ఆర్‌వీ గణపతి రాజు, వైస్ ప్రెసిడెంట్స్ ఎస్ఎస్ఎన్ రాజు, బుద్దరాజు శివాజీ, జాయింట్ సెక్రటరీస్ వి.జానకిరామ రాజు, సెక్యూరిటీ శ్రీను, కమిటీ సభ్యులు, డైరెక్టర్స్, ఎఫ్‌కెఎస్ఎస్ చైర్మన్ సీహెచ్ వెంకటపతి రాజు, మహీధర కెమికల్స్ బలరామ రాజు, కె.రంగరాజు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళను రక్షించిన ఆర్పీఎఫ్

విశాఖపట్నం, అక్టోబరు 2: సింహాచలం రైల్వేస్టేషన్‌లో ఆత్మహత్యకు యత్నించిన మహిళను ఆర్పీఎఫ్ సిబ్బంది రక్షించారు. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఆర్పీఎఫ్ తెలిపిన వివరాల ప్రకారం..నగరంలోని బాజి జంక్షన్‌కు చెందిన ఓ వివాహిత (21) తన భర్తతో వాగ్వాదం జరగడంతో ఇంటి నుంచి పారిపోయి సింహాచలం రైల్వే స్టేషన్‌కు చేరింది. ఒకటో ప్లాట్‌ఫామ్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆమెను విధుల్లో ఉన్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ అనిత గుర్తించి విచారించారు. ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చానని, ఇంటికి తిరిగి వెళ్లడం ఇష్టం లేదని తెలపడంతో వెంటనే అప్రమత్తమైన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఆమెను అదుపులోకి తీసుకుని ఏఎస్ఐ కెఆర్‌కె.రావుకు సమాచారమిచ్చింది. వెంటనే అక్కడికి చేరుకున్న ఏఎస్ఐ..బాధితురాలిని టీటీఈ గదికి తీసుకువచ్చి కౌన్సెలింగ్ చేసి ఆత్మహత్య యత్నం ఆలోచనను విరమించుకునేలా చేశారు. ఆమె సోదరి ఫోన్ నంబరు తీసుకుని సమాచారమిచ్చారు. బాధితురాలి భర్త, ఆమె సోదరి సింహాచలం రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ఆర్పీఎఫ్ సిబ్బంది బాధితురాలి భర్తకు కౌన్సెలింగ్ నిర్వహించి సాక్షుల సమక్షంలో అతని భార్యను అప్పగించారు.

'చెత్త పన్ను రద్దును స్వాగతిస్తాం'

డాబాగార్డెన్స్, అక్టోబరు 2: రాష్ట్ర వ్యాప్తంగా చెత్త పన్ను రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించడాన్ని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు స్వాగతించారు. అదే విధంగా ఆస్తి పన్ను మార్కెట్ విలువ ఆధారంగా కాకుండా పాత పద్ధతిలోనే అద్దె ప్రతిపాదికన వసూలు చేసి ప్రజలకు ఊరట కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇలా చేసినట్టయితే పేద, మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి ప్రజలకు ఎక్కువ మేలు జరుగుతుందని తెలిపారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఆస్తి పన్నును మార్కెట్ విలువ ఆధారంగా వసూలుకు పూనుకునప్పుడు టీడీపీ పూర్తిగా వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు.

పోర్టు ఆసుపత్రి కోసం రెండో రోజుకు చేరిన దీక్ష

అక్కయ్యపాలెం, అక్టోబరు 2: పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ యత్నాలు ఆపాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ఎదుట నిర్వహిస్తున్న నిరాహారదీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. సంఘం గౌరవాధ్యక్షుడు పీఎస్ పద్మనాభరాజు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జె.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, ఈశ్వరరావు, శ్రీను, రామారావు, వెంకటరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ బంగ్లాలా జడ్పీ అతిథిగృహం

... 5వ పేజీ తరువాయి

ఆధునికీకరించాలని భావించారు. అయితే ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వ ఆమోదం పొందాలన్న స్పృహ లేకుండా వ్యవహరించారు. మంత్రి చెప్పారు కదా..అని అందుబాటులో ఉన్న ఒక కాంట్రాక్టర్‌ను పిలిచి పనులు చేయాలని పురమాయించేశారు. రెండస్థుల భవనంపై మరో ఫ్లోర్ నిర్మాణం, భవనం మొత్తం ఆధునికీకరణ పనులు చేపట్టారు. గదుల్లో ఉన్న మంచాలపై బెడ్లు, డైనింగ్‌హాలులో కుర్చీలు, ఇతర సామగ్రి పక్కనపడేశారు. అయితే అప్పటివరకూ ఖర్చు చేసిన రూ.35 లక్షలకు సంబంధించి బిల్లులు ఇవ్వాలని కాంట్రాక్టర్ కోరిన తరువాత గానీ అధికారికంగా వర్క్ ఆర్డర్ ఇవ్వలేదని విషయం అధికారులకు గుర్తుకువచ్చింది. ఈలోగా విశాఖలో పాలనా రాజధానిపై హైకోర్టులో కేసు దాఖలు కావడం, ప్రభుత్వం రాజధానిపై వెనుకంజ వేయడంతో అతిథిగృహం పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఆ తరువాత కొద్దినెలలకు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో పంచాయతీరాజ్ శాఖ నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నుంచి తప్పించారు. ఆ శాఖను ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన బూడి ముత్యాలనాయుడుకు అప్పగించారు. ఈ నేపథ్యంలో జడ్పీ అతిథిగృహం మరమ్మతులు పూర్తిచేయడానికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వలేదు. దీంతో ఫర్నీచర్ మొత్తం పాడైపోయింది. అలాగే సుమారు మూడున్నరేళ్లగా భవనాన్ని వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. లోపలగదుల్లో ఎక్కడ సామగ్రి అక్కడే విడిచిపెట్టడంతో ఐరన్‌తో తయారుచేసిన వస్తువులు తుప్పుపట్టాయి. ప్రస్తుతం అతిథిగృహం గేటు కూడా ఒకపక్క విరిగిపోయి ఉంది. ఆవరణ మొత్తం పిచ్చిమొక్కలతో బూత్ బంగ్లాను తలపిస్తోంది.

ఇప్పటికీ అందని బిల్లులు

వర్క్ ఆర్డర్ లేకపోవడంతో చేసిన రూ.35 లక్షలకు సంబంధించి బిల్లులు విడుదల కాలేదు. పనులు చేయాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బిల్లులు మంజూరు విషయంలో చొరవ తీసుకోలేదు. ఆ తరువాత వచ్చిన మంత్రి బూడి ముత్యాలనాయుడు తనకు సంబంధం లేదని తెగేసి చెప్పారు. అప్పట్లో పనులు పురమాయించిన అధికారులు బదిలీపై వెళ్లిపోయారు. గత ఏడాది నుంచి 16వ ఆర్థిక సంఘం నిధులు జడ్పీకి వస్తున్నా అతిథిగృహం ఆధునికీకరణకు పాలకులు చొరవ చూపలేదు. కూటమి ప్రజా ప్రతినిధులు మరోమారు అధికారులతో అంచనాలు తయారుచేయించి, టెండర్ల ద్వారా కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసి పనులు పూర్తిచేయించగలిగితే నగరంలో మరో మంచి అతిథిగృహం అందుబాటులోకి వస్తుంది.

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం రేపు

... 5వ పేజీ తరువాయి

నియంత్రించేందుకు వీలుగా వైసీపీ హయాంలో 36 మంది వార్డు వలంటీర్లతో ప్రతి జోన్‌కు ఒక తనిఖీ బృందాన్ని ఏర్పాటుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వార్డు వలంటీర్లు లేరు. ఆ 36 మందిని కూడా తొలగించారని అంతా భావించారు. కానీ వారు ఇప్పటికీ పనిచేస్తున్నారని, మార్చి నుంచి జూన్ వరకూ మూడు నెలల జీతం ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున చెల్లించేందుకు అనుమతివ్వాలని ఎజెండాలో ప్రతిపాదించడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. అలాగే 67వ వార్డు పరిధి పెంటయ్య నగర్‌లో వార్డు సచివాలయ భవనంపై అదనపు అంతస్థు నిర్మాణానికి రూ.47.5 లక్షలు, సామాజిక భవన నిర్మాణానికి రూ.25 లక్షలు ఖర్చుపెట్టే అంశాన్ని ఎజెండాలో ప్రతిపాదించారు. గాజువాక వంటిల్లు జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఐలాండ్ విస్తరణకు రూ.49.2 లక్షలు, కొత్తగా తారు రోడ్డు నిర్మాణం, ప్రస్తుతం ఉన్న రోడ్డు విస్తరణకు రూ.48 లక్షలు ఖర్చుపెట్టాలని ప్రతిపాదించారు. 93వ వార్డు పరిధిలోని ప్రహ్లాదపురం చెరువు వెనుక నూకాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి రూ.49.82 లక్షలు ఖర్చు పెట్టాలని ప్రతిపాదించారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో 11,12,13 వార్డు పరిధిలో కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పొందుపరిచారు.

ఏయూలో ఏఐ

... 5వ పేజీ తరువాయి

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి కోర్సులను వచ్చే ఏడాది నుంచి ప్రత్యేక బ్రాంచీలుగా ఏర్పాటుచేసి ప్రవేశాలు కల్పించేందుకు ఏయూ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటిని బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డిపార్టుమెంట్‌లతో అనుసంధానం చేయనున్నారు.

సీట్లపై తర్జనభర్జన

ఆయా కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్న అధికారులు ఎన్ని సీట్లతో ప్రారంభించాలన్న దానిపై తర్జనభర్జన పడుతున్నారు. ఇందుకోసం ఇంజనీరింగ్ కాలేజీలోని వివిధ విభాగాలకు చెందిన ప్రొఫెసర్‌లతో సంప్రతింపులు జరుపుతున్నారు. రెండు, మూడు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు తెలిపారు. నూతనంగా ప్రారంభించబోయే కోర్సులతో విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్నందునే వర్సిటీలో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ఇతర కోర్సులపై కూడా అధ్యయనం చేస్తున్నామని, వాటికి ఉన్న డిమాండ్, విద్యార్థులు చేరేందుకు గల అవకాశాలు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకువస్తామని రిజిస్ట్రార్ వెల్లడించారు.

పర్యాటక అక్రమాలపై మరో కమిటీ

... 5వ పేజీ తరువాయి

పనిచేసిన అధికారిని విచారణకు ఎలా పంపించారంటూ మండిపడ్డారు. ఆ నివేదికను పక్కన పెట్టి, కొత్త కమిటీని వేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏపీటీడీసీ ఫైనాన్స్ జీఎం రిషిబాబు, కాకినాడ రీజనల్ డైరెక్టర్ స్వామినాయుడుతో పాటు ఏపీ టూరిజం అథారిటీకి చెందిన మరికొందరిని చేర్చి కొత్త కమిటీని వేశారు. వీరు గురువారం విశాఖపట్నం వచ్చి విచారణ నిర్వహిస్తారు.

'పీలా'కు అభినందనలు

పెందుర్తి రూరల్, అక్టోబరు 2: ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను మండలంలోని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం పెందుర్తిలోని ఆయన నివాసంలో కలిశారు. పుష్పగుచ్ఛాలందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎంపీపీ కాళ్ళ వరలక్ష్మి, చింతలగ్రహారం సర్పంచి దాడి గోపి అప్పలనాయుడు, మాజీ సర్పంచి ఆళ్ళ తాతారావు, నాయకులు మద్దాల శ్రీనివాసరావు, బొడ్డేటి సతీష్ , సంతోశ్ ఉన్నారు.

బొజ్జన్నకొండ వద్ద లైటింగ్ అండ్ సౌండ్ షో ప్రారంభం

తుమ్మపాల, అక్టోబరు 2 : ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద ఏర్పాటు చేసిన లైటింగ్ అండ్ సౌండ్ షోను కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ బుధవారం రాత్రి ప్రారంభించారు. బొజ్జన్నకొండ చరిత్రపై ప్రదర్శించిన లేజర్ షోను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ బొజ్జన్నకొండ చరిత్రను పర్యాటకులతో పాటు విద్యార్థులకు వివరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, ఆర్డీవో చిన్నికృష్ణ, డీపీవో శిరీషారాణి, ఎస్‌డీసీ ఎస్. సుబ్బలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌కే బీచ్‌లో స్వచ్ఛతా హీ సేవ



బీచ్‌రోడ్డు శుభ్రతలో పాల్గొన్న బృందం సభ్యులు

మహారాణిపేట, అక్టోబరు 2: నెహ్రూ యువజన కేంద్రం, ఆంధ్ర విశ్వకళా పరిషత్, జాతీయ సేవా కేంద్రం విశాఖపట్నం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఆర్‌కే బీచ్‌లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. 'మై భారత్' డైరెక్టర్ సారా జియాల్ వాక్మి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం బీచ్‌రోడ్డులోని యూత్ హాస్టల్‌లో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకలలో మాట్లాడుతూ బీచ్‌లలో పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నగరంలోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యువతీ యువకులు పాల్గొన్నారు.

ఎంపీ సీఎం రమేశ్‌కు స్వాగతం

గాజువాక, అక్టోబరు 2: గాజువాక విచ్చేసిన అనకాపల్లి ఎంపీ, రైల్వే శాఖ పార్లమెంటరీ కమిటీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్‌కు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం స్వాగతం పలికారు. ఎంపీ రమేశ్‌కు ప్రతిష్ఠాత్మకమైన రైల్వే శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ పదవి రావడం ఎంతో గొప్ప విషయమని కరణంరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాటా శ్రీనివాస్, గూటూరు శంకరరావు, బొండా యల్లజీరావు, రోహిణి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఆళ్వార్స్' విద్యార్థుల శ్రమదానం

వేపగుంట, అక్టోబరు 2: గోపాలపట్నం ఆర్.ఆర్.వి.పురంలోని ఆళ్వార్స్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. సింహాచలం కొండపైన వెళ్లే మార్గంలో ఉన్న చెత్తాచెదారాలను తొలగించి మొక్కలు నాటారు. పరిశుభ్రతపై భక్తులకు అవగాహన కల్పించారు. సింహాచలం ఈవో త్రినాథరావు వారితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆళ్వార్స్ విద్యా సంస్థల డైరెక్టర్ రాహుల్, ఆళ్వార్‌దాస్, ప్రిన్సిపాల్ యు.గోపి, తదితరులు పాల్గొన్నారు.

'స్వరూపానందకు మౌనం తగదు'

పెందుర్తి, అక్టోబరు 2: శారదా పీఠాధిపతిగా చలామణీ అవుతున్న స్వరూపానందసరస్వతి పేరును స్వరూపా పాల్‌గా మార్చామని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో పంచకర్ల రమేశ్‌బాబును కలిసి శారదా పీఠాధిపతిపై పలు అభియోగాలతో ఫిర్యాదు పత్రం అందజేశారు. హిందూయిజంపై చర్చించడానికి తాను శారదా పీఠానికి వెళితే తనతో మాట్లాడడానికి ఆయన నిరాకరించారని వివరించారు. కల్తీ నెయ్యితో తిరుపతి లడ్డూ అపవిత్రం చేయడం, తదితర ఘటనలపై స్వరూపానందేంద్ర మౌనం వహించారని, దీనిపై వివరణ ఇవ్వాలన్నారు.

కదంతొక్కిన కాంట్రాక్టు కార్మికులు

కుటుంబాలతో సహా కూర్మన్నపాలెం కూడలిలో రాస్తారోకో

తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్





కూర్మన్నపాలెం కూడలిలో హైవేపై బైఠాయించి ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు. (ఇన్‌సెట్లో) రాస్తారోకోలో పాల్గొన్న మహిళలు

కూర్మన్నపాలెం, అక్టోబరు 2: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు కదంతొక్కారు. తమకు న్యాయం చేయాలంటూ కుటుంబాలతో కలిసి కూర్మన్నపాలెంలో రాస్తారోకో చేపట్టారు. కర్మాగారంలో పనిచేస్తున్న తొలగించిన 4,200 మందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులతో కలిసి బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు కూర్మన్నపాలెం జంక్షన్‌లో వందలాది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు బైఠాయించి రాస్తారోకో చేశారు. దీంతో జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు బారులుతీరి నిలిచిపోయాయి. బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసినా రాస్తారోకోను నిలువరించ లేకపోయారు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టు కార్మికులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేకుంటే సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంటును కేంద్రం ప్రైవేటీకరించాలనుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిరసిత నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, ఎన్.గంగారావు, పులి వెంకటరమణారెడ్డి, కేఎస్ఎన్ రావు, ఎన్.రామారావు, నీరుకొండ రామచంద్రరావు, జెర్రిపోతుల ముత్యాలు, బొడ్డు పైడిరాజు, విల్లా రామ్మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు నివాళి

పలు ప్రాంతాల్లో ఘనంగా గాంధీ జయంతి



88వ వార్డులో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన పల్లా శ్రీనివాసరావు



గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే గణబాబు



తుంగ్లాంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

గాజువాక, అక్టోబరు 2: జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని బుధవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గాజువాక జోనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. అలాగే బాపూజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాల వద్ద పువ్వులు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు. టీడీపీ 73వ వార్డు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో తెలుగు యువత గాజువాక అధ్యక్షుడు బలగ బాలునాయుడు పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాత గాజువాకలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. యువత బాపూజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, నాయకులు ముమ్మడివరపు రాము, ఉరుకూటి శ్రీనువాసరావు, ఒమ్మి రాము, కె.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



వీఎస్ఈజెడ్‌లో గాంధీ చిత్రపటం వద్ద పుష్పాలు పెడుతున్న డీసీ శ్రీనివాస్

అలాగే మహాత్ముని అడుగు జాడల్లో అందరూ ముందుకు సాగాలని వీఎస్ఈజెడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాల శ్రీనివాస్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారులు రోషిణి అపరంజి కోరాటి, ప్రసన్న కుమార్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: ఎన్ఎస్‌టీఎల్‌లో డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్ మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్టేషనరీ కిట్‌లను పంపిణీ చేశారు. ఎన్ఎస్‌టీఎల్ వర్క్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ హెచ్ఎన్ దాస్, వేడుకల కమిటీ ప్రతినిధులు రవి ఆనంద్, బాల్మీకి పండిట్, అలోక్‌కుమార్ చంద్, ఎన్ఎస్‌టీఎల్ సీఈ యూనియన్ కార్యదర్శి జేఎన్ శర్మ, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. కాగా గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పి.గణబాబు, టీడీపీ నాయకులు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాపురం: హిందుస్థాన్ షిప్‌యార్డులో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి విగ్రహాలకు సంస్థ సీఎండీ హేమంత్ ఖత్రీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: నడుపూరు గాంధీ పార్కులో పైడిమాంబ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ప్రతినిధులు మంత్రి శంకర నారాయణ, ఎం.అచ్చెంనాయుడు, టి.కాశీవిశ్వేశ్వరరావు, డాక్టర్ కె.మంగరాజు, బి.కృష్ణారావు, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే బీసీ రోడ్డు గాంధీ జంక్షన్‌లోని బాపూజీ విగ్రహానికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, మండల నాయకుడు ఎం.పెంటయ్య పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

ఎన్.ఎ.డి.జంక్షన్/వేపగుంట: గ్రేటర్ 52వ వార్డు న్యూ కరాసలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పి.గణబాబు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. అనంతరం టీడీపీ వార్డు ఇన్‌చార్జి వెంకుమహంతి చంద్రశేఖర్ ఆర్థిక సహకారంతో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాం యువజన సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బాపూజీ అడుగుజాడల్లో అందరూ నడవాలన్నారు. నాయకులు కొల్లి కుంచారావు, పి.అర్జున్, వి.వరహాలు, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. భెల్ హెచ్‌పీవీపీ గుర్తింపు కార్మిక సంఘం భవనంలో ఏజీఎం నీరాకర్ ముండా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

అగనంపూడి: టీడీపీ 79వ వార్డు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. యువత గాంధీజీ మార్గంలో నడవాలని ఆయన కోరారు. అలాగే టీడీపీ 85వ వార్డు కార్యాలయంలో బాపూజీ చిత్రపటానికి అధ్యక్షుడు కర్రి దేశేంద్ర పుష్పమాల వేశారు.

ఆర్పీపేట, (కంచరపాలెం): ఆర్పీపేట గ్రామ పాలక వర్గం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే గణబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు అన్న సమారాధన చేపట్టారు. కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్దనున్న గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్య నిషేధాన్ని అమలు చేయాలి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 2: రాష్ట్ర ప్రభుత్వ కొత్త మద్యం పాలసీ మహిళల పాలిట శాపమని, టీడీపీ వ్యవస్థాపకులు దివంగత ఎన్టీ రామారావు ఆశయాలకు కట్టుబడి సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేయాలని రాష్ట్ర మహిళా సమాఖ్య అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి బూసి పరమేశ్వరి డిమాండ్ చేశారు. మద్యనిషేధం చేయాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ గాంధీ విగ్రహం వద్ద బుధవారం నినాదాలు చేశారు. సమాఖ్య ప్రతినిధులు లక్ష్మీ, రమణమ్మ, సరస్వతి, మున్ని, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మలకొలువు

వేపగుంట, అక్టోబరు 2: వేపగుంట పరిసర ప్రాంతాల ఆరాధ్య దైవం ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు చూపరులను అమితంగా ఆకట్టుకుంది. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను పరిసర ప్రాంతాల ప్రజలు తిలకించారు.

వరద బాధితుల సహాయార్థం చెక్కు అందజేత

గాజువాక, అక్టోబరు 2: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు విజయవాడ వరద బాధితుల సహాయార్థం గాజువాక చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు ముందుకు వచ్చారు. విరాళాల రూపంలో సేకరించిన రూ.1,11,111 చెక్కును బుధవారం గాజువాకలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అందజేసింది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పవన్ దీక్షకు సంఘీభావం

పెందుర్తి రూరల్, అక్టోబరు 2: తిరుమల లడ్డూ అపవిత్రంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు సంఘీభావంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు బుధవారం సుజాతానగర్ నుంచి చినముషిడివాడ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వరకు సాగిన కోలాటం ప్రదర్శనలో పాల్గొన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ

అగనంపూడి, అక్టోబరు 2: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలసలోని సీడబ్ల్యూసీ వద్ద బుధవారం స్థానిక వికాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులు, వింతువులకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి కరణం జోగినాయుడు మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులకు అందరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు వి.వెంకటరమణ, బి.సత్యనారాయణ, రామకోటి, ఈశ్వరరావు, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ, శాస్త్రిలకు ఘననివాళి


టీడీపీ కార్యాలయంలో గాంధీ, శాస్త్రిల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న తెలుగుదేశం నగర అధ్యక్షుడు గండి బాబ్జీ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు


జనసేన నగర కార్యాలయంలో గాంధీ, శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


పార్టీ కార్యాలయంలో జాతినేతల చిత్రపటాలకు నమస్కరిస్తున్న బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక తదితరులు

మహారాణిపేట, అక్టోబరు 2: తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు, ఇద్దరు ప్రముఖుల చిత్రపటాలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జి, శాసనమండలి సభ్యుడు వేపాడ చిరంజీవిరావులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రజల గుండెల్లో ఈ నేతలిద్దరూ చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పొలమర శెట్టి శ్రీనివాసరావు, సౌత్ ఇన్‌చార్జు సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్లు గొలగాని వీరరావు, ఉరుకూటి నారాయణరావు, వి.భాస్కరరావు, వి.భరత్, కేదారి లక్ష్మి, గనగళ్ల సత్యవతి పాల్గొన్నారు. కేజీహెచ్ పరిపాలనా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, అధికారులు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు వైద్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం (స్పోర్ట్సు): మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను పోర్టు స్టేడియంలో కరాటే సంఘాల ప్రతినిధులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ నటుడు సుమన్ ముఖ్య అతిథిగా హాజరై శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాస్త్రి చేసిన జై కిసాన్, జై జవాన్ నినాదం విశేష ప్రాచుర్యం పొంది ప్రజల్లో దేశభక్తిని పెంపొందించిందని సుమన్ గుర్తుచేశారు. రెండో ప్రధానిగా ఆదర్శనీయమైన సేవ లందించిన మహోన్నత వ్యక్తిగా లాల్ బహదూర్ శాస్త్రి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో కాశీ విశ్వనాథ్, డాక్టర్ రఘు, సీహెచ్.సతీష్‌కుమార్, ఆనంద బాలు, కరాటే క్రీడాకారులు, మాస్టర్లు పాల్గొన్నారు.

సీతంపేట: జనసేన నగర పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన పార్టీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ నియోజకవర్గాల ఇంచార్జులు ఉషాకిరణ్, ప్రశాంతి, శివ ప్రసాద్‌రెడ్డి, వసంత లక్ష్మి, కార్పొరేటర్ నాగరాజు పాల్గొన్నారు.

సీతమ్మధార: సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో గాంధీజీ, మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తిల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీరి చిత్రపటాలకు బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతమ్మధారలోని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో గాంధీజీ కాంస్య విగ్రహానికి ఉద్యోగులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చీఫ్ జనరల్ మేనేజర్లు డి.సుమ్ కల్యాణి, బి.రామచంద్రప్రసాద్, ఎస్.హరిబాబు, టీవీఎస్ఎన్ మూర్తి, బి.అశోక్ కుమార్, జనరల్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: పోర్టుస్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు. శాంతిపురంలో లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహానికి రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అల్లిపురం: అల్లిపురం నీలమ్మ వేపచెట్టు, నేరెళ్ల కోనేరు ప్రాంతాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని జాతిపితకు ఘననివాళులర్పించారు. నీలమ్మవేప చెట్టు ప్రాంతంలో జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటర్ భీశెట్టి వసంత లక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నేరెళ్ల కోనేరు వద్ద కార్పొరేటర్ కందుల నాగరాజు వృద్ధులకు కళ్ల జోళ్లు పంపిణీ చేశారు.

మురళీనగర్; మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మాధవధార కళింగనగర్ వైసీపీ కార్యాలయంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, ఆ పార్టీ నాయకులు, అనుచరులు, స్థానికులతో కలసి గాంధీ మహాత్మునికి నివాళి అర్పించారు. 51వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వార్డు అధ్యక్షులు సనపల. కీర్తి ఆధ్వర్యంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు సంయుక్తంగా వేడుకలు జరిపారు. 50వ వార్డు వాకర్స్‌క్లబ్‌లో పల్లా చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులు వాకర్స్ పార్కులోని స్మారక విగ్రహం వద్ద గాంధీకి పూలమాలలతో నివాళి అర్పించారు. వైశాఖీ స్పోర్ట్సు పార్కులోనూ, తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోనూ అధ్యక్షుడు సనపల. వరప్రసాద్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయాలు, యువజన, కాలనీ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.

కరాటేను ప్రత్యేక క్రీడాంశంగా గుర్తించాలి

▸▸ సినీ నటుడు సుమన్ సూచన


వైజాగ్ ఓపెన్ జాతీయ కరాటే టోర్నీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు సుమన్, ఇతర ప్రముఖులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 2: కరాటేను ప్రత్యేక క్రీడాంశంగా గుర్తించి ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని సినీ నటుడు సుమన్ తల్వార్ సూచించారు. వాడోకై కరాటే సంఘం, డ్రాగన్ ఫోర్సు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించనున్న రెండో వైజాగ్ ఓపెన్ జాతీయ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీ బ్రోచర్‌ను బుధవారం పోర్టు స్టేడియంలో సుమన్ తల్వార్ ఆవిష్కరించారు. కరాటేను ఆత్మరక్షణకు దోహదపడే విద్యగా పరిగణించాలన్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో ఏది నేర్చుకున్నా ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుందన్నారు. కరాటే క్రీడాంశానికి విశాఖ ప్రధాన కేంద్రంగా గుర్తింపు పొందుతోందన్నారు. కొత్త టెక్నిక్స్‌పై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించిన సతీష్‌కుమార్ అభినందనీయుడని కొనియాడారు. టోర్నీ ప్రధాన నిర్వాహకుడు చిగురుపల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ డిసెంబరు 15 నుంచి పోర్టు స్టేడియంలోని విశ్వనాధ స్పోర్ట్సు క్లబ్ వేదికగా నిర్వహించనున్న వైజాగ్ ఓపెన్ జాతీయ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీలో సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బొడ్డేటి కాశీ విశ్వనాథ్, జనసేన రాష్ట్ర వైద్య విభాగం చైర్మన్ బొడ్డేపల్లి రఘు, బీజేపీ నాయకులు బొత్స సురేష్‌కుమార్, కరాటే మాస్టర్లు అంగరాము, ఆనందబాలు, బాలకృష్ణ, అంబు, శివగణేష్ పాల్గొన్నారు.

ఆలయాల్లో శరన్నవరాత్రి శోభ


కనకమహాలక్ష్మి అమ్మవారు

జగదాంబ కూడలి, అక్టోబరు 2: పాతనగరంలోని ప్రధాన ఆలయాల్లో శరన్నవరాత్రి పూజలకు దేవాలయాల అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి ఈ నెల 12 విజయదశమి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఈవో కె.శోభారాణి తెలిపారు. విజయవాడ కనదుర్గ ఆలయంలో మాదిరి కనకమహాలక్ష్మి ఆలయం వద్ద అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ క్రమంలో ఉదయం 6 గంటల నుంచి 9 వరకు భక్తుల దర్శనాలకు అనుమతించచడంలేదన్నారు. ప్రత్యేక వారాల్లో నిర్వహించనున్న క్షీరాభిషేకం, అష్టదళ పద్మారాధన, తులసీదళ పూజలు నిలిపివేస్తారు. పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి వద్ద దుర్గాదేవి భక్తులు మాలధారణలతో అమ్మవారి పూజలకు సిద్ధమవుతున్నారు. కుమ్మరవీధి ప్రాంతంలో బహుముఖ రూపాల పోలమాంబ అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ పేర్కొంది. పాతనగరంలోని దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న పలు ముఖ్య దేవాలయాలను దసరా ఉత్సవాల సందర్భంగా ముస్తాబు చేశారు.

సాయి ధ్యానమందిరంలో అన్న సమారాధన


భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 2: గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో బుధవారం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు మాట్లాడుతూ నిత్యాన్నదాన కార్యక్రమాన్ని 14 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరి కుటుంబంలోనైనా జరిగే వివాహ, జన్మదినం, పెద్దల జ్ఞాపకార్థం, ఇతర శుభకార్యాలకు సాయిబాబా నిత్యాన్న ప్రసాదం వితరణ చేస్తున్నట్లు చెప్పారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత


▸▸ మొక్క నాటుతున్న సీఐ దాశరథి

మర్రిపాలెం, అక్టోబరు 2: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఇంటూరి భూషణం మాస్టార్ ఆధ్వర్యంలో కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం సీఐ మాట్లాడుతూ పర్యవరణాన్ని కాపాడి పచ్చదనాన్ని పెంపొందించవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కొత్తపాలెం తెలుగు ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు, సూరిబాబు, పోలీసుస్టేషన్ సిబ్బంది రవిచంద్ర, వైఆర్ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రత దిశగా పయనిస్తున్నాం

▸▸ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్


పార్కును శుభ్రపరుస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఇతర సిబ్బంది

విశాఖపట్నం, అక్టోబరు 2: గాంధీ జయంత్యుత్సవాల్లో భాగంగా వాల్తేరు రైల్వే 15 రోజులు నిర్వహించిన స్వచ్ఛా హి సేవ కార్యక్రమాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్ఎంలు సుధీర్ కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు డీఆర్ఎం కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతలో అగ్రగామిగా నిలిచే దిశగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. వేదిక వద్ద ప్రదర్శించిన స్వచ్ఛా హి సేవా అంశంపై విద్యార్థులు రూపొందించిన చిత్రాలు బాగున్నాయని అభినందించారు. పారిశుధ్య కార్మికులకు హెల్త్ కిట్లు పంపిణీ చేయడంతోపాటు, స్వచ్ఛా హి సేవా అంశంపై నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం స్టేషన్ సమీపంలోని రైల్వే పార్కును పారిశుధ్య పనులలో డీఆర్ఎం, అధికారులు, వాల్తేరు డివిజన్ మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు శుభ్రం చేశారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు


కృత్రిమ అవయవాలు పొందిన లబ్ధిదారులతో నిర్వాహకులు

సీతమ్మధార, అక్టోబరు 2: సీతమ్మధారలోని క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ మంగళంపల్లి సౌజన్యంతో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్స్, వినికిడి పరికరాలు, అంధులకు చేతికర్రలు తదితర పరికరాలు పంపిణీ చేశారు. వీటి విలువ సుమారు రూ.2.5 లక్షలు ఉంటుందని తెలిపారు. 150 మంది దివ్యాంగులు పాల్గొని కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్ తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మహీధర కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.లక్ష, క్షత్రియ సంక్షేమ సమితి చైర్మన్ ఎంఎస్ఎన్ రాజు రూ.లక్ష, డైరెక్టర్ ఎంఆర్‌కె రాజు రూ.50 వేలు వితరణ చేశారు. అధ్యక్షులు దాట్ల తిరుపతి రాజు, చైర్మన్ ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి ఆర్‌వీ గణపతి రాజు, వైస్ ప్రెసిడెంట్స్ ఎస్ఎస్ఎన్ రాజు, బుద్దరాజు శివాజీ, జాయింట్ సెక్రటరీస్ వి.జానకిరామ రాజు, సెక్యూరిటీ శ్రీను, కమిటీ సభ్యులు, డైరెక్టర్స్, ఎఫ్‌కెఎస్ఎస్ చైర్మన్ సీహెచ్ వెంకటపతి రాజు, మహీధర కెమికల్స్ బలరామ రాజు, కె.రంగరాజు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళను రక్షించిన ఆర్పీఎఫ్

విశాఖపట్నం, అక్టోబరు 2: సింహాచలం రైల్వేస్టేషన్‌లో ఆత్మహత్యకు యత్నించిన మహిళను ఆర్పీఎఫ్ సిబ్బంది రక్షించారు. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఆర్పీఎఫ్ తెలిపిన వివరాల ప్రకారం...నగరంలోని బాజి జంక్షన్‌కు చెందిన ఓ వివాహిత (21) తన భర్తతో వాగ్వాదం జరగడంతో ఇంటి నుంచి పారిపోయి సింహాచలం రైల్వే స్టేషన్‌కు చేరింది. ఒకటో ప్లాట్‌ఫామ్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆమెను విధుల్లో ఉన్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ అనిత గుర్తించి విచారించారు. ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చానని, ఇంటికి తిరిగి వెళ్లడం ఇష్టం లేదని తెలపడంతో వెంటనే అప్రమత్తమైన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఆమెను అదుపులోకి తీసుకుని ఏఎస్ఐ కెఆర్‌కె.రావుకు సమాచారమిచ్చింది. వెంటనే అక్కడికి చేరుకున్న ఏఎస్ఐ...బాధితురాలిని టీటీఈ గదికి తీసుకువచ్చి కౌన్సెలింగ్ చేసి ఆత్మహత్య యత్నం ఆలోచనను విరమించుకునేలా చేశారు. ఆమె సోదరి ఫోన్ నంబరు తీసుకుని సమాచారమిచ్చారు. బాధితురాలి భర్త, ఆమె సోదరి సింహాచలం రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ఆర్పీఎఫ్ సిబ్బంది బాధితురాలి భర్తకు కౌన్సెలింగ్ నిర్వహించి సాక్షుల సమక్షంలో అతని భార్యను అప్పగించారు.

'చెత్త పన్ను రద్దును స్వాగతిస్తాం'

డాబాగార్డెన్స్, అక్టోబరు 2: రాష్ట్ర వ్యాప్తంగా చెత్త పన్ను రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించడాన్ని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు స్వాగతించారు. అదే విధంగా ఆస్తి పన్ను మార్కెట్ విలువ ఆధారంగా కాకుండా పాత పద్ధతిలోనే అద్దె ప్రతిపాదికన వసూలు చేసి ప్రజలకు ఊరట కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇలా చేసినట్టయితే పేద, మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి ప్రజలకు ఎక్కువ మేలు జరుగుతుందని తెలిపారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఆస్తి పన్నును మార్కెట్ విలువ ఆధారంగా వసూలుకు పూనుకునప్పుడు టీడీపీ పూర్తిగా వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు.

పోర్టు ఆసుపత్రి కోసం రెండో రోజుకు చేరిన దీక్ష

అక్కయ్యపాలెం, అక్టోబరు 2: పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ యత్నాలు ఆపాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ఎదుట నిర్వహిస్తున్న నిరాహారదీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. సంఘం గౌరవాధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జె.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, ఈశ్వరరావు, శ్రీను, రామారావు, వెంకటరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ బంగ్లాలా జడ్పీ అతిథిగృహం

... 5వ పేజీ తరువాయి

ఆధునికీకరించాలని భావించారు. అయితే ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వ ఆమోదం పొందాలన్న స్పృహ లేకుండా వ్యవహరించారు. మంత్రి చెప్పారు కదా...అని అందుబాటులో ఉన్న ఒక కాంట్రాక్టర్‌ను పిలిచి పనులు చేయాలని పురమాయించేశారు. రెండస్థుల భవనంపై మరో ఫ్లోర్ నిర్మాణం, భవనం మొత్తం ఆధునికీకరణ పనులు చేపట్టారు. గదుల్లో ఉన్న మంచాలపై బెడ్లు, డైనింగ్‌హాలులో కుర్చీలు, ఇతర సామగ్రి పక్కనపడేశారు. అయితే అప్పటివరకూ ఖర్చు చేసిన రూ.35 లక్షలకు సంబంధించి బిల్లులు ఇవ్వాలని కాంట్రాక్టర్ కోరిన తరువాత గానీ అధికారికంగా వర్క్ ఆర్డర్ ఇవ్వలేదని విషయం అధికారులకు గుర్తుకువచ్చింది. ఈ లోగా విశాఖలో పాలనా రాజధానిపై హైకోర్టులో కేసు దాఖలు కావడం, ప్రభుత్వం రాజధానిపై వెనుకంజ వేయడంతో అతిథిగృహం పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఆ తరువాత కొద్దినెలలకు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో పంచాయతీరాజ్ శాఖ నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నుంచి తప్పించారు. ఆ శాఖను ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన బూడి ముత్యాలనాయుడుకు అప్పగించారు. ఈ నేపథ్యంలో జడ్పీ అతిథిగృహం మరమ్మతులు పూర్తిచేయడానికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వలేదు. దీంతో ఫర్నిచర్ మొత్తం పాడైపోయింది. అలాగే సుమారు మూడున్నరేళ్లగా భవనాన్ని వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. లోపలగదుల్లో ఎక్కడ సామగ్రి అక్కడే విడిచిపెట్టడంతో ఐరన్‌తో తయారుచేసిన వస్తువులు తుప్పుపట్టాయి. ప్రస్తుతం అతిథిగృహం గేటు కూడా ఒకపక్క విరిగిపోయి ఉంది. ఆవరణ మొత్తం పిచ్చిమొక్కలతో బూత్ బంగ్లాను తలపిస్తోంది.

ఇప్పటికీ అందని బిల్లులు

వర్క్ ఆర్డర్ లేకపోవడంతో చేసిన రూ.35 లక్షలకు సంబంధించి బిల్లులు విడుదల కాలేదు. పనులు చేయాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బిల్లులు మంజూరు విషయంలో చొరవ తీసుకోలేదు. ఆ తరువాత వచ్చిన మంత్రి బూడి ముత్యాలనాయుడు తనకు సంబంధం లేదని తెగేసి చెప్పారు. అప్పట్లో పనులు పురమాయించిన అధికారులు బదిలీపై వెళ్లిపోయారు. గత ఏడాది నుంచి 16వ ఆర్థిక సంఘం నిధులు జడ్పీకి వస్తున్నా అతిథిగృహం ఆధునికీకరణకు పాలకులు చొరవ చూపలేదు. కూటమి ప్రజా ప్రతినిధులు మరోమారు అధికారులతో అంచనాలు తయారుచేయించి, టెండర్ల ద్వారా కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసి పనులు పూర్తిచేయించగలిగితే నగరంలో మరో మంచి అతిథిగృహం అందుబాటులోకి వస్తుంది.

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం రేపు

... 5వ పేజీ తరువాయి

నియంత్రించేందుకు వీలుగా వైసీపీ హయాంలో 36 మంది వార్డు వలంటీర్లతో ప్రతి జోన్‌కు ఒక తనిఖీ బృందాన్ని ఏర్పాటుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వార్డు వలంటీర్లు లేరు. ఆ 36 మందిని కూడా తొలగించారని అంతా భావించారు. కానీ వారు ఇప్పటికీ పనిచేస్తున్నారని, మార్చి నుంచి జూన్ వరకూ మూడు నెలల జీతం ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున చెల్లించేందుకు అనుమతివ్వాలని ఎజెండాలో ప్రతిపాదించడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. అలాగే 67వ వార్డు పరిధి పెంటయ్య నగర్‌లో వార్డు సచివాలయ భవనంపై అదనపు అంతస్థు నిర్మాణానికి రూ.47.5 లక్షలు, సామాజిక భవన నిర్మాణానికి రూ.25 లక్షలు ఖర్చుపెట్టే అంశాన్ని ఎజెండాలో ప్రతిపాదించారు. గాజువాక వంటిల్లు జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఐలాండ్ విస్తరణకు రూ.49.2 లక్షలు, కొత్తగా తారు రోడ్డు నిర్మాణం, ప్రస్తుతం ఉన్న రోడ్డు విస్తరణకు రూ.48 లక్షలు ఖర్చుపెట్టాలని ప్రతిపాదించారు. 93వ వార్డు పరిధిలోని ప్రహ్లాదపురం చెరువు వెనుక నూకాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి రూ.49.82 లక్షలు ఖర్చు పెట్టాలని ప్రతిపాదించారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో 11,12,13 వార్డు పరిధిలో కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పొందుపరిచారు.

ఏయూలో ఏఐ

... 5వ పేజీ తరువాయి

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి కోర్సులను వచ్చే ఏడాది నుంచి ప్రత్యేక బ్రాంచీలుగా ఏర్పాటుచేసి ప్రవేశాలు కల్పించేందుకు ఏయూ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటిని బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డిపార్టుమెంట్‌లతో అనుసంధానం చేయనున్నారు.

సీట్లపై తర్జనభర్జన

ఆయా కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్న అధికారులు ఎన్ని సీట్లతో ప్రారంభించాలన్న దానిపై తర్జనభర్జన పడుతున్నారు. ఇందుకోసం ఇంజనీరింగ్ కాలేజీలోని వివిధ విభాగాలకు చెందిన ప్రొఫెసర్‌లతో సంప్రతింపులు జరుపుతున్నారు. రెండు, మూడు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎస్ ధనుంజయరావు తెలిపారు. నూతనంగా ప్రారంభించబోయే కోర్సులతో విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్నందునే వర్సిటీలో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ఇతర కోర్సులపై కూడా అధ్యయనం చేస్తున్నామని, వాటికి ఉన్న డిమాండ్, విద్యార్థులు చేరేందుకు గల అవకాశాలు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకువస్తామని రిజిస్ట్రార్ వెల్లడించారు.

పర్యాటక అక్రమాలపై మరో కమిటీ

... 5వ పేజీ తరువాయి

పనిచేసిన అధికారిని విచారణకు ఎలా పంపించారంటూ మండిపడ్డారు. ఆ నివేదికను పక్కన పెట్టి, కొత్త కమిటీని వేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏపీటీడీసీ ఫైనాన్స్ జీఎం రిషిబాబు, కాకినాడ రీజనల్ డైరెక్టర్ స్వామినాయుడుతో పాటు ఏపీ టూరిజం అథారిటీకి చెందిన మరికొందరిని చేర్చి కొత్త కమిటీని వేశారు. వీరు గురువారం విశాఖపట్నం వచ్చి విచారణ నిర్వహిస్తారు.

'పీలా'కు అభినందనలు

పెందుర్తి రూరల్, అక్టోబరు 2: ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను మండలంలోని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం పెందుర్తిలోని ఆయన నివాసంలో కలిశారు. పుష్పగుచ్ఛాలందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎంపీపీ కాళ్ళ వరలక్ష్మి, చింతలగ్రహారం సర్పంచి దాడి గోపి అప్పలనాయుడు, మాజీ సర్పంచి ఆళ్ళ తాతారావు, నాయకులు మద్దాల శ్రీనివాసరావు, బొడ్డేటి సతీష్ , సంతోశ్ ఉన్నారు.

బొజ్జన్నకొండ వద్ద లైటింగ్ అండ్ సౌండ్ షో ప్రారంభం

తుమ్మపాల, అక్టోబరు 2 : ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద ఏర్పాటు చేసిన లైటింగ్ అండ్ సౌండ్ షోను కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ బుధవారం రాత్రి ప్రారంభించారు. బొజ్జన్నకొండ చరిత్రపై ప్రదర్శించిన లేజర్ షోను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ బొజ్జన్నకొండ చరిత్రను పర్యాటకులతో పాటు విద్యార్థులకు వివరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, ఆర్డీవో చిన్నికృష్ణ, డీపీవో శిరీషారాణి, ఎస్‌డీసీ ఎస్. సుబ్బలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌కే బీచ్‌లో స్వచ్ఛతా హీ సేవ


బీచ్‌రోడ్డు శుభ్రతలో పాల్గొన్న బృందం సభ్యులు

మహారాణిపేట, అక్టోబరు 2: నెహ్రూ యువజన కేంద్రం, ఆంధ్ర విశ్వకళా పరిషత్, జాతీయ సేవా కేంద్రం విశాఖపట్నం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఆర్‌కే బీచ్‌లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. 'మై భారత్' డైరెక్టర్ సారా జియాల్ వాక్మి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం బీచ్‌రోడ్డులోని యూత్ హాస్టల్‌లో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకలలో మాట్లాడుతూ బీచ్‌లలో పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నగరంలోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యువతీ యువకులు పాల్గొన్నారు.

పోలమాంబ దేవాలయంలో నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



తగరపువలస,అక్టోబరు 2 : సంగివలస పోలమాంబ అమ్మవారి (మూడుగుళ్ల అమ్మవారు) ఆలయంలో గురువారం నుంచి ఈనెల 12 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు దేవాదాయ శాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దసరా సందర్భంగా ఏటా ఇక్కడ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ.తొలిరోజు కుంకుమార్చనలతో పూజలు ప్రారంభమవుతాయి. 9న చండీ హోమం, 11న పూర్ణాహుతి ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. 20న భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 2 : పల్నాడు జిల్లా వినుకొండ లయోలా కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అవంతి, తిరుమల ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రథమ స్థానంలో నిలవడంతో నిర్వాహకులు వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.ఈమేరకు వారు ఈనెల 14 నుంచి 18 వరకు జమ్మూ కశ్మీరులోని శ్రీనగర్‌లో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనున్నట్టు కళాశాల యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. విజేతలు బి. భరత్ సాయి, రాజేశ్, గురు చరణ్, కె. నెహాల్‌ను ఆయా కళాశాలల అధ్యాపకులు అభినందించారు.

విద్యుత్ ఉద్యోగుల సంబరాలు



ఈఈ శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయకులు

మధురవాడ, అక్టోబరు 2 :ఏపీ ఈపీడీసీఎల్ సంస్థలో గ్రేడ్-2 లైన్‌మెన్‌గా 2019 అక్టోబరు 2న విధుల్లో చేరిన ఉద్యోగులు బుధవారం నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు. బుధవారం వారు జోన్-3 ఈఈ, రాష్ట్ర బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావును మధురవాడ సబ్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఈపీడీసీఎల్ డిస్కమ్ అధ్యక్షుడు నాయుడు, విశాఖ రీజనల్ అధ్యక్షుడు నగేష్, మధుసూదనరావు, సుదర్శన్, నాయుడుబాబు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వామివారికి కల్యాణం చేస్తున్న అర్చకులు

సింహాచలం, అక్టోబరు 2 : వరాహలక్ష్మీనృసింహ స్వామికి బుధవారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళార్చన చేశారు. తరువాత గోవిందరాజ స్వామిని రజితగరుడ వాహనంపై ఉంచి నృసింహ అష్టోత్తర శతనామావళితో పూజలు జరిపి, భక్తులు దాని చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ చేశారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిత్య కల్యాణం జరిపి, మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అవంతి కళాశాలలో స్వచ్ఛ భారత్

తగరపువలస, అక్టోబరు 2 : అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో గాంధీ జయంతి పురస్కరించుకుని విద్యార్థులు, అధ్యాపకులు బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభా గం ఆధ్వర్యంలో విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేసి, చెత్తను తొలగించారు. అనంతరం గాంధీజీ విగ్రహం వద్ద నివాళి అర్పించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

భీమునిపట్నం, అక్టోబరు 2 : డీసీసీ అధ్యక్షుడు అడ్డాల వెంకట వర్మ రాజు ఆధ్వర్యంలో భీమిలికి చెందిన నందూరి వీర్రాజు (కళింగరాజు) ఎన్. ప్రవీణ్, లయన్స్ క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ వర్మ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం వారంతా నగరంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి సమక్షంలో పార్టీలో చేరినట్టు నాయకులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

26 మద్యం బాటిళ్లు పట్టివేత

ఎండాడ, అక్టోబరు 2 :మధురవాడలో అనధికారికంగా మద్యం అమ్మకాలు చేస్తున్న మహిళను పీఎంపాలెం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ సునీత తెలిపిన వివరాలు ప్రకారం.. మధురవాడలోని డాక్ యార్డు కాలనీలో అనధికారికంగా మద్యం అమ్ముతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. ఈమేరకు కర్రి జయలక్ష్మిని అరెస్టు చేసి, 26 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.

'పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి'



మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

తగరపువలస, అక్టోబరు 2 : విద్యార్థులు పోటీ పరీక్షలకు అనుగుణంగా సన్నద్ధం కావాలని పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ పి. విజయభాస్కర్ చెప్పారు. బుధవారం ఆయన చిట్టివలస ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తరగతి పాఠాలతో పాటు పోటీ పరీక్షలకు అనుగుణంగా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు.

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



సిరిపురం : మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న కమిషనర్ విశ్వనాథన్



ఏయూలో జరిగిన వేడుకల్లో వీసీ శశిభూషణరావు, తదితరులు



సెంట్రల్ పార్కు వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జీవీఎంసీ ఉద్యోగులు, కార్పొరేటర్లు

మహాత్ముడి జీవితం.. అందరికీ ఆదర్శం

- వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్
- వాడవాడలా ఘనంగా గాంధీ జయంతి

సిరిపురం, అక్టోబరు 2 : జాతి పిత మహాత్మా గాంధీ జీవితం భావితరాలకు ఆదర్శనీయమని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు. బుధవారం ఆయన గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ భవన్‌లో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటీష్ వారిపై అహింసా మార్గంలో గాంధీజీ చేపట్టిన స్వాతంత్ర్య ఉద్యమం భావితరాలకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, డీఎఫ్ఓ శాంతి స్వరూప్, ఎస్ఈ బలరామరాజు, ఇంజనీర్లు ఎస్‌వీఎస్ఎన్ రాజు, మధు, రామరాజు, రాంబాబు పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయంలో..

ఆరిలోవ : ప్రతిఒక్కరూ గాంధీజీ అడుగు జాడలో నడవాలని డీఈఓ చంద్రకళ అన్నారు. విద్యాశాఖ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ, ఏయూలో..

వెంకోజీపాలెం : సత్యం, అహింస మార్గాలతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి అన్నారు. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా జీవీఎంసీ సమీపంలో సెంట్రల్ పార్కు వద్ద ఉన్న వారి విగ్రహాలకు ఆయన పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్లు బిపిన్ జైన్, భీశెట్టి వసంత లక్ష్మి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు. ఏయూలోనూ గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. పరిపాలనా భవనం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి వీసీ ఆచార్య జి. శశిభూషణరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ధనుంజయరావు, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, అధికారులు పాల్గొన్నారు.

భీమిలి జోనల్ కార్యాలయంలో...

భీమునిపట్నం : జోనల్ కార్యాలయం వద్ద గాంధీజీ విగ్రహానికి జడ్సీ పి. ప్రేమ ప్రసన్న వాణి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో మహాత్మా గాంధీజీ కృషిని వివరించారు. యువత పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, పీపుల్ పవర్ సభ్యులతో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. అలాగే బీచ్ రోడ్‌లో గాంధీ పార్క్‌లో ఉన్న మహాత్ముడి విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. 3వ వార్డు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలోనూ గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు.



తన క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి



పద్మనాభం మండలంలోని తునివలసలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎంవీపీకాలనీ : సత్యం, అహింస ప్రధాన ఆయుధాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు అన్నారు. ఎంవీపీ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో గాంధీ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనరెడ్డి, కాళ్ల శంకర్, అక్కరబోయిన రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం (రూరల్) : స్వాతంత్ర్య ఉద్యమం స్ఫూర్తి ప్రదాత గాంధీ అని భీమిలి ఏఎంసీ వైస్ చైర్మన్ గొర్రిపాటి పెద్ద ఎర్రినాయుడు అన్నారు. అనంతవరం, తునివలస గ్రామాల్లో గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మద్దిలో మాజీ ఎంపీపీ కాళ్ల పద్మ, నగేష్ కుమార్ దంపతులు గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తునివలస మాజీ సర్పంచ్ జి. మహేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆర్ఎఎన్ మూర్తి. టీడీపీ నాయకులు నందిని, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, తదితరులు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆచార్యులు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. గంగాధరరావు, కార్యదర్శి ఎం. భరద్వాజ, గీతం సలహాదారు ప్రొఫెసర్ జి. సూర్యనారాయణ, సీఈవో మీనా, జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి. గీతాంజలి పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గంటా, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు



మొక్క నాటుతున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

పరిశుభ్రత జీవితంలో భాగం కావాలి

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది, అక్టోబరు 2 : ప్రతి ఒక్కరి జీవితంలో స్వచ్ఛత ఒక భాగం కావాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కాపులుప్పాడ డంపింగ్ యార్డులో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్ఛదనానికి, స్వచ్ఛతా కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యం కల్పిస్తున్నారని చెప్పారు. తాను విద్యా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు పరిశుభ్రత అంశాన్ని పాఠ్యాంశంలో చేర్పించినట్టు చెప్పారు. గత ఐదేళ్లలో వ్యవస్థలన్నీ భ్రష్టు పట్టాయని విమర్శించారు. జగన్ ప్రభుత్వం చెత్తపై వేసిన పన్నును కూటమి రద్దు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ ఏడీసీలు సోమన్నారాయణ, వర్మ, రమణమూర్తి, సీఎంహెచ్‌వో నరేశ్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీను, 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, గరే గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ప్రధానమని తర్లువాడ సర్పంచ్ నాయడు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికీ రూ. 10 లక్షల మెడికల్ బీమాను ఆయన తన సొంత నిధులతో కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ శారదా ప్రియాంక, తాట్రాజు అప్పారావు, మజ్జి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం విజయవంతానికి పారిశుధ్య కార్మికులు కీలకమని జడ్పీ సీఈవో సత్యనారాయణ అన్నారు. గొట్టిపల్లి పంచాయతీలో జరిగిన స్వచ్ఛతా హీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీపీవో శ్రీనివాసరావు, ఏపీడీ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతోనే గ్రామాల్లో శుభ్రత

పద్మనాభం : ప్రజలు గ్రామ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని ఎంపీడీఓ ఎం. విజయకుమార్ అన్నారు. పద్మనాభంలోని సంపద తయారీ కేంద్రంలో బుధవారం జరిగిన స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ తడి, పొడి చెత్తను వేరు చేసే విధానాలు అలవర్చుకొని, ఇళ్ల వద్దకు వచ్చే క్లాప్ మిత్రలకు ఇవ్వాలన్నారు. వాటిని సంపద తయారీ కేంద్రంలో తడి చెత్తతో వానపాము ఎరువును, పొడి చెత్తను వేరు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ ఆదాయంతో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే క్లాప్ మిత్రలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, సర్పంచ్ పాప, స్థానిక నాయకులు పద్దు, ఎర్నాయుడు, కార్యదర్శి రఘు పాల్గొన్నారు. తునివలసలోనూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయకుమార్



రాట్నంపై నూలు వడుకుతున్న ఎమ్మెల్యే గంటా

చేనేత వస్త్రాలకు పూర్వ వైభవం : ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, అక్టోబరు 2 : చేనేత వస్త్రధారణ మన సంప్రదాయంలో భాగమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఖాదీ మేళాను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేనేత వస్త్రాలను ప్రోత్సహించడమే కాకుండా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఖాదీ, చేనేత వస్త్రాలకు పూర్వ వైభవం తీసుకురావడం దేశ పౌరులందరి బాధ్యత అని చెప్పారు. అనంతరం వస్త్ర ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించి, ఒక దుకాణంలో రాట్నంపై నూలు వడికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు మాధవ్, ఎం నాగేంద్ర, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఖైదీల సంక్షేమ దినోత్సవం



ఖైదీకి నమస్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆరిలోవ, అక్టోబరు 2 : సత్యం, అహింస, ధర్మం, సత్యాగ్రహం వంటి మంచి గుణాలు కలిగిన మహ నీయుడు జాతి పిత మహాత్మా గాంధీ అని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. బుధవారం కేంద్ర కారాగారంలో జరిగిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఖైదీలు హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, జైలు సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్లు, ఉప పర్యవేక్షణాధికారి కమలాకర్ పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పూజలు

సింహాచలం, అక్టోబరు 2 : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా కూటమి నాయకులు బుధవారం వరాహలక్ష్మీనృసింహస్వామికి పూజలు చేశారు. 98వ వార్డు జనసేన అధ్యక్షుడు మజ్జి సూరిబాబు సారథ్యంలో తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు బసన అప్పలనాయుడు, పార్టీ నేత రచ్చ ఆనంద శ్రీనివాస వర్మ, టీడీపీ నేతలు బంటుబిల్లి మహేశ్ గునిడి శంకరరావు, సిరిపురపు సురేష్, రాజనాల సత్యారావు పాల్గొన్నారు.

యువ గాయకుడికి సత్కారం



మోహన్ కుమార్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ రాంబాబు, నగేష్‌కుమార్

పద్మనాభం, అక్టోబరు 2 : పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెం గ్రామానికి చెందిన యువ గాయకుడు అలమండ మోహన్ కుమార్‌ను బుధవారం రాత్రి స్థానికులు ఘనంగా సత్కరించారు. విజయనగరం సంగీత కళాశాలలో కర్ణాటక గాత్ర సంగీతం అభ్యసించిన మోహన్‌కుమార్ గాయకుడిగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. ముఖ్యంగా గత వారం జీ తెలుగులో సరిగమప కార్యక్రమంలో సంగీత దర్శకుడు కోటితో అభినందనలు అందుకోవడమే కాకుండా నగదు ప్రోత్సాహకం పొందాడు. ఈమేరకు గ్రామానికి వచ్చిన యువకుడ్ని స్థానిక నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె. రాంబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కె. నగేష్‌కుమార్, స్థానిక నాయకులు పద్మనాభస్వామి, పద్దు, ఎర్నాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'వాల్ ఆఫ్ ఇండియన్ ఐకాన్' ప్రారంభం

భీమునిపట్నం, అక్టోబరు 2: బీచ్ రోడ్‌లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు థీమ్ పార్కులో పట్టణానికి చెందిన యువకులు వాల్ ఆఫ్ ఇండియన్ ఐకాన్‌ను బుధవారం ప్రారంభించారు. మిషన్ గ్రీన్ భీమిలి, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి, భీమిలి నీడీ వెల్ఫేర్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్‌డబ్ల్యూ సభ్యుడు ముసునూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేసి వారి సేవలు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని ప్రగతి పథంలో నడిపిన సామాజిక కార్యకర్తలు, శాస్త్రవేత్తల జీవిత విశేషాలను నేటి తరానికి తెలుపుతామన్నారు.



భైరవస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

అప్పన్న సన్నిధిలో అమావాస్య పూజలు

సింహాచలం, అక్టోబరు 2 : భాద్రపద మాస బహుళపక్ష అమావాస్య పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 11.30 గంటలకు రాజభోగ నివేదన కోసం భక్తులకు దర్శనాలు నిలిపివేసిన తరువాత సుదర్శన పెరుమాళ్‌ను పల్లకిలో ఉంచి గ్రామ బలిహరణ జరిపారు. అనంతరం మాడవీధుల్లోని అష్టదిక్పాలకులకు పూజలు చేసి నివేదనలు ఇచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధి జరిపారు. అలాగే భైరవస్వామికి కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజామునే ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా సరిహద్దు గ్రామాలకు చెందిన భక్తులు సింహాచలం చేరుకుని పుష్కరిణిలో స్నానాలు చేసి భైరవస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి సింహగిరికి చేరుకుని అప్పన్న స్వామిని దర్శించుకున్నారు.

వెంకోజీపాలెం : కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో ఉన్న భైరవస్వామి ఆలయంలో భక్తులు అమావాస్య పూజలు నిర్వహించారు. భైరవస్వామిని దర్శనానికి వేకువజామున 5 గంటల నుంచే భక్తులు బారులు తీరారు. అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాశ్, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలభాస్కర శర్మ భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోర రమణారెడ్డి, కాళ్ల వరహాలు, సభ్యులు బోర ఎర్రాజీరెడ్డి, ఎస్. నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

వెంకోజీపాలెం, అక్టోబరు 2 : అంతర్గత క్రమశిక్షణ గాంధీజీ ముఖ్య లక్షణమని వీసీ ఆచార్య శశిభూషణరావు అన్నారు. గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఏయూ న్యాయ కళాశాలలో నిర్వహిస్తున్న 'ఇష్యూస్ అండ్ చాలెంజెస్ ఆఫ్ జెండర్ జస్టిస్ అండ్ ఈక్వాలిటీ-ఏ గాంధియన్ పర్‌స్పెక్టివ్' రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును వీసీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్గత క్రమశిక్షణ గాంధీజీ నుంచి నేర్చుకోవాలన్నారు. గాంధీజీ ఎన్నడూ సహనం కోల్పోలేదని, కోపం, ఆగ్రహం వ్యక్తం చేయకుండా తన పోరాటాన్ని శాంతియుతంగా నిర్వహించారన్నారు. ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం నేడు గాంధీజీ చూపిన బాటలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య కె. సీతామాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

జంతువుల సంరక్షణ అందరి బాధ్యత

ఆరిలోవ, అక్టోబరు 2 : అడవుల పరిరక్షణ పాటు జంతువులను కాపాడే బాధ్యత అందరిపై ఉందని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) శ్రీకంఠనాథరెడ్డి అన్నారు. బుధవారం ఆయన జూపార్కులో నిర్వహించిన వన్య ప్రాణుల సప్తాహాన్ని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల అనేక జంతువులకు రక్షణగా ఉంటుందన్నారు. జూక్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ ఈ వారోత్సవాలు 8వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అనంతరం విద్యార్థులకు సీతాకోక చిలుకలు, అంతరించిపోతున్న సముద్ర జీవులు గురించి డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు మంగమ్మ, గోపి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగం అభివృద్ధికి ఎంవీవీఎస్ మూర్తి కృషి



నివాళి అర్పిస్తున్న గీతం కార్యవర్గం సభ్యులు

ఎండాడ, అక్టోబరు 2 : గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (గీతం) విద్యాలయం స్థాపనకు మహాత్మా గాంధీయే స్ఫూర్తి అని గీతం విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గంగాధరరావు అన్నారు. ఎండాడ - రుషికొండ రోడ్డులోని డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి స్మృతివనం వద్ద బుధవారం డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి పారిశ్రామిక, రాజకీయ, విద్యా రంగాల్లో ఎంవీవీఎస్ మూర్తి తనదైన ముద్ర వేశారని చెప్పారు. విజయాలు, అపజయాలను సమానంగా స్వీకరించడం, అంకితభావం, కష్టపడే తత్వాలను మూర్తి నుంచి నేర్చుకోవాల్సిన విషయాలన్నారు. కార్యక్రమంలో గీతం కార్యదర్శి ఎం. భరద్వాజ్, ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, జిమ్‌సర్ ప్రో వీసీ ప్రొఫెసర్ బి. గీతాంజలి, గీతం సలహాదారు ప్రొఫెసర్ గొల్లు సూర్యనారాయణ . పలు కళాశాలల డీన్‌లు, ప్రిన్సిపాళ్లు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.